
# కన్నకడుపు



## గరికపాటి కృష్ణమూర్తి

"ఏమండి! ఈసారి అమ్మాయిని' అల్లుణ్ణి పండక్కి ఒక్క నెల రోజులు ముందే వచ్చేయమని రాయండి."

"అతనికి సెలవు దొరకొద్దూ!"

"పోనీ, దాన్నైనా ఒక పదిహేను రోజులు ముందు పంపించమని రాయండి."

"రాస్తాను. రేపే రాస్తాను. కాని అతను పంపిస్తానన్నా అమ్మాయే రానంటుందేమోనని." భార్యవంక చూశాడు జానకిరామయ్య.

"ఎందుకు రాదు? దాన్ని చూచి చాలాకాలమయినట్లుంది. దానికిమాత్రం మనవిూదుండ దేమిటి?"

"ఎందుకుండదు తల్లికి. రాసే ప్రతి ఉత్తరంలోనూ 'నాన్నా విూ ఆరోగ్యం బాగా చూసుకుంటూ వుండ'మని మరీ రాస్తుంది. కాకపోతే పోయిన పండక్కి మరి నాల్గురోజులుండిపో అంటే 'ఆయన హోటలు భోజనంతో చాలా యిబ్బందిపడుతూవుంటారు నాన్నా!' అంటూ వెళ్లిపోయింది."

భార్య విశాలాక్షి నవ్వింది.

"పోనీలే. వాళ్లిద్దరూ అలా చిలకాగోరింకల్లా వుంటే మనకు మాత్రం కావల్సిందేముంది!" సంతృప్తిపడ్డాడు జానకిరామయ్య.

జానకిరామయ్య, విశాలాక్షమ్మలకు ఏకైక సంతానం కమల. ఇంకో మగ నలుసు కలగాలని మొక్కుకొన్నారుగాని వారి కలలేవిూ ఫలించలేదు. కమలలోనే మగబిడ్డని చూచుకొని ముచ్చటపడ్డారు. తమ స్థాయిమేరకు కమలని అల్లారు ముద్దుగా పెంచారు. గారాబంగా చూశారు. అలా చూసుకుంటూవుండగానే కమల పెద్దదై పెళ్లీడుకొచ్చి కూర్చుంది. ఆ అనుబంధ బలం ఎంతదో కమల పెళ్లి విషయమై భార్య యెత్తినపుడు తెలిసింది. కూతురి పెళ్లిచేసి అత్తగారింటికి పంపేటపుడు తమ ప్రియాతి ప్రియమైన వస్తువును ఎవరో ఎత్తుకుపోతున్నట్లు ఫీలయ్యాడు. నట్టింట్లో లక్ష్మీదేవిలా కళకళలాడుతూ తిరిగే బిడ్డ యింట్లో లేకపోయినపుడు యేదో పోగొట్టుకొన్న వాడిలా వాపోయాడు. ఇంట్లోనేగాదు; అంతరాంతరాల్లో ఏదో వెలితి; దిగులు; విచారం; దుఃఖం; అనుభవించాడు.

రాత్రిపూట నిద్ర పట్టేదిగాదు. పట్టిన మగత నిద్రలో కూడా 'నాన్నా యింకా నిద్రపోలేదా' అంటూ కమల వచ్చేది. నిద్రపట్టితే కలలో వచ్చేది. ఇంకా చిన్నారి పలుకులు, చిట్టిపొట్టి నడకలతో తనతో ఏవో కబుర్లు చెప్తూ నవ్విస్తూ వున్నట్లనిపించేది.

బిడ్డ ఎంతలో ఎంత ఎదిగిపోయింది! పదిహేడు సంవత్సరాలు యిట్టే వెళ్లిపోయినయ్.

పెళ్లికి నిశ్చయ తాంబూలాలు పుచ్చుకొన్న రోజునుండే దాని కళ్లల్లో ఎన్ని దివ్వెలు వెలిగినయ్. అన్నివిధాల అనుకూలమైన సంబంధం. 'పాప' అదృష్టవంతురాలని చుట్టుప్రక్కల అమ్మలక్కలు పొగిడినపుడు యెంత సంతోషపడింది; ఎంత ఆనందం పొందింది!!

బిడ్డ ఆనందంకంటే తల్లిదండ్రులు కోరుకొనే దేముంటుంది ?

"ఇదుగో. కాఫీ తీసుకోండి !" భార్య మాటలకి ఈ లోకంలోకి వచ్చిపడ్డాడు. విశాలాక్షి ఎప్పుడు లోపలకెళ్లిందో, ఎప్పుడు కాఫీ కల్పుకొచ్చిందో తనకు తెలియనే తెలియదు.

కాఫీ అందుకుంటూ "పండగ ఎప్పుడంటావు ?" అన్నాడు.

"ఏదీ! ఎల్లుండి వచ్చే సోమవారానికి నెల వుంటుందట" అన్నది.

"అయితే రేపే రాస్తాను."

"రోజు విడిచి రోజు రాస్తూనే ఉన్నారుగా! కాస్త గట్టిగా రాయండి తప్పకుండా రమ్మని."

"ఒకవేళ..."

"మీకన్నీ అనుమానాలూ— అపశకునాలే. పిల్ల ఎందుకు రాదండీ ? తప్పక వస్తుంది. ఒకవేళ..."

"ఆఁ! ఒకవేళ..."

"రావటానికి వీలుపడదని రాస్తారనుకుంటే నాకు వంట్లో బాగోలేదని రాయండి."

"ఛ! అవేం మాటలు ... అది నిజమేననుకొని బాధపడుతుంది "

విశాలాక్షికి యిది నిజమేననిపించింది. లేనిపోనిదానికి దానిని హైరాన పెట్టినట్లవుతుంది. ఉన్నపాటున యిద్దరూ బయలుదేరి రావొచ్చు. ఆవిధంగా రాయటం మంచిదికాదు.

"పోనీ ఒకటి చేద్దామండి..." ఏదో ఆలోచించిన దానిలా అన్నది.

"ఏమిటో ?"

"అల్లుడికి సూట్, నీకు నైలక్సు చీర మీరు కొన్నట్లూ, వాటిని ఈ పండక్కి వచ్చి కట్టుకు పోవలసిందిగా రాస్తాను."

జానకిరామయ్య ఆలోచనలో పడ్డాడు.

ఎందుకు ఆలోచనల్లో పడ్డాడో విశాలాక్షికి తెల్సు.

"మీకెపుడూ వుండే గొడవే! ప్రతి పండక్కి వాళ్లని తీసుకొస్తున్నామా ? పెడుతున్నామా ? ఇదేదో పెద్దపండగ. అచ్చటా ముచ్చటా అన్నారు. దానికిమాత్రం ఎవరున్నారు గనకా ! అక్కా ? అన్నా ! దానికి మనం — మనకి అది."

"అంతే. పోయిన పండక్కే ఏమీ పెట్టలేదని నొచ్చుకుందన్నావు ?"

"నొచ్చుకొన్నది. అయినా యితరుల దగ్గర మనమీద ఈగని వాలనివ్వదు. మన పరిస్థితేమిటో దానికి తెలియదా ఏమిటి ? అందుకనే నగానట్రా అడగలేదు. ముచ్చటపడి 'నైలక్సు' చీర ఒకటి పెట్టండమ్మా ! అన్నది. ఆమాత్రం సరదాకూడా తీర్చలేక పోయాం."

జానకిరామయ్యకు కూడా బాధ అనిపించింది. అప్పుడు చేతిలో చిల్లిగవ్వ ఆడక దాని ముద్దు తీర్చలేకపోయాడు. పెళ్లికి చేసిన బాకీలే యెలాగో నెలకి యింతని యింటిలో ఒక పోర్షను అద్దెకిచ్చి తీర్చుకొంస్తూ ఉన్నాడు. వచ్చే పెన్షను డబ్బులతో యిద్దరూ కృష్ణా రామా అంటూ గడుపు




కొంస్తున్నారు. ఈ విషయం విశాలాక్షికి తెలుసు. కూతురు కమలకీ తెల్సు. అట్లని తమని బాధించి దొరికినకాడికి పట్టుకుపోదామన్న అభిప్రాయ మున్నదీకాదు, దోచిపెడదామని భార్య కుండీగాదు.

నలుగురిలాగ సరదాలుంటయ్. పైగా సరదాలుండే వయస్సు. అదీగాక నలుగురు అమ్మలక్కలు చేరి 'మీ నాన్నగారు ఏమిచ్చారు ?' అని అడిగుండొచ్చు. బిడ్డ యేమీ సమర్థించుకోలేని సంకటావస్థలో పడి ఉండొచ్చు. అందుకనే నోరుతెరిచి అడిగుండొచ్చు. ఈసారి ధీమగా గర్వంగా చెప్పకునేటట్లు చెయ్యాలి. మా నాన్నగారు పండక్కి పెట్టిన చీరని నలుగురుతో చెప్పకోవాలి.

జానకిరామయ్య కూతురు కోర్కెను పోయిన పండక్కి తీర్చలేనందుకు నిందించుకొన్నాడు. పొరపాటైపోయిం దనుకున్నాడు.

"ఏమిటంటారు ?" మళ్లీ భార్య ప్రశ్న.

"అలాగె తప్పకుండా రాయి".

"మరి డబ్బు ?"

"నీకు తెలియని దేముంది? దాని ముచ్చటే మన ముచ్చట. ఎక్కడో ఒకచోట అప్పు పుట్టకపోదు సాయంకాలం రామారావుని అడుగుతాను."

"అలాగే. ముందే చెప్పిఉంటే మంచిది. మరీ యెక్కువ అడగబోకండి. రెండొందలు చాలు. ఒక వంద దానికి, మరో వంద అతనికి యిద్దాం. కొనుక్కుంటారు. ఎక్కువ తెస్తే తీర్చటం కష్టమౌతుంది.

"మరి ఖర్చులకి ?"

"నా దగ్గర ఒక వంద అట్టిపెట్టాను లెండి అవి సరిపోతవి."

జానకిరామయ్య భార్యవంక సంతృప్తిగా చూశాడు.

ఎప్పుడూ కష్టసుఖాల్లో చేదోడు వాదోడుగా ఉంటుంది.

"ఎంత మంచిదానివి విశాలాక్షీ !" అన్నాడు.

దానికే ఆమె మురిసిపోయి "చాల్లెండి. అలా పోష్టాఫీసుకు వెళ్లి ఒక ఉత్తరం వేసిరండి" అన్నది.

చేతికర్ర బట్టుకొని, గబగబా అడుగులు వేసుకుంటు పోతున్న భర్తవంక మలుపు తిరిగే వరకూ చూస్తూనే ఉన్నది.

*                *                *

పండక్కి పదిహేను రోజులు ముందు కాదుగదా అసలు రావటం పడదేమోనని, వీలైతే నాలుగైదు రోజులు ముందు రావటానికి ప్రయత్నిస్తామని అల్లుడు రాసిన ఉత్తరానికి దంపతు లిద్దరూ హతాశులయ్యారు. పోనీలే కనీసం పండక్కయినా వస్తారుగదాని అనుకోవటానికి వీలైతే అని రాశాడు. జానకిరామయ్య వెంటనే తిరుగుటపాలో ఎలాగోలా వీలు చూచుకొని రావల్సిందని, మీ కోసం యెదురు చూస్తూ ఉంటామని మీరు లేకపోతే తమకి పండగే లేదని యేవేవో రాశేశాడు. పండగ నాలుగు రోజు లుండనగా వచ్చే ప్రతి రిక్షావంక చూసేవాడు. ఉండబట్టలేక రైలుస్టేషను వరకూ వెళ్లేవాడు; ఆ దారినే బస్స్టాండ్కు వెళ్లేవాడు. కాని వాళ్ళు రాలేదు.

రేపు పండగనగా దంపతులిద్దరూ అరుగు మీద కూర్చుని కాసేపు అటూ యిటూ

పోయే ఆడపిల్లలవంక చూస్తూ కూర్చున్నారు. వాళ్లు చక్కగా అలంకరించుకొని, మంచి చీరలు కట్టుకొని, సంతోషంగా పేరంటాని కెళ్తున్నారు.

"చూడండి. ఆ అమ్మాయికి ఆ చీర, ఆ కట్టు యెలా అమరినయ్యో! ఆ వయస్సుకి ఆ చీర చాలా అందంగా ఉంది".

"ఔనౌను... మన అమ్మాయి కూడా అంతకంటే బాగుంటుంది. అటువంటి చీరే కొనుక్కోమను".

అలా ఆ అమ్మాయి వంక చూస్తున్న వాళ్లు అటువైపునుండే వచ్చే రిక్షావైపు దృష్టి మళ్లించారు. మసగ మసగ్గా వాళ్ల అమ్మాయి — అల్లుడిలాగానే అనిపించారు. కూతురు బాబిగాడిని వళ్లో కూర్చోబెట్టుకుంది... రిక్షా వచ్చి యింటిముందు ఆగింది.

"అమ్మాయి—అమ్మాయి... వచ్చేశారు". ఒక్క ఉదుటున లేచి ఎదురేగాడు. విశాలాక్షి ఎదురేగింది. మనవణ్ణి ఎత్తుకుంది. ముద్దెట్టుకొన్నది. "నేను తీసుకొస్తానుండం

## కన్న కడుపు

డన్నా అల్లుడి మాట వినకుండా సామాన్లన్ని యింట్లోకి చేర్చాడు జానకిరామయ్య.

ఆ సాయంకాల మయ్యేవరకు. అటు అల్లుణ్ణిగాని యిటు కూతుర్నిగాని రెస్టు తీసుకోనివ్వలేదు. బాబిగాడిని నిద్రపోనీయలేదు. ఏవో అడుగుతునే ఉన్నాడు జానకిరామయ్య. వాళ్లు చెప్తూనే ఉన్నారు. అడిగిన క్షేమ సమాచారాన్నే మళ్లీ అడుగుతున్నాడు.

పండగనాడు భోజనాలయిన తర్వాత అల్లుడు — కూతురు చేతుల్లో తలో వంద పెట్టి మీ యిష్టమొచ్చినవి కొనుక్కోమన్నారు. వాళ్లు తృప్తిగానే స్వీకరించారు.

ఆనాడే షాపింగ్‌కి బయలుదేరింది కమల బాబిగాడిని అమ్మదగ్గర పెట్టి.


బజారు కెళ్లిన కమల ఓ గంటలో వచ్చేసింది. రెండు ప్యాకెట్లు తెచ్చింది. కమల వచ్చీరాగానే విశాలాక్షి 'ఏదమ్మా మీ నాన్నగారు నిన్ను ఆ చీరలో చూడాలని కలవరిస్తున్నారు. ఒకసారి కట్టుకో పండగపూట!' అడిగింది.

'అలాగేనమ్మా' అని 'ఒరేయ్ బాబి యిటు రా!' అని కొడుకుని పిలిచి ఒక పాకెట్టు విప్పి వాడికి మేజోళ్లు తొడిగింది. చెడ్డీ వేసింది. ఖరీదైన బుష్ షర్టు వేసింది. ఆఖరికి తలమీద ఉలెన్ టోపీ కూడా తీసుకొచ్చింది. తొడిగేసింది. వాడు సంతోషంతో గెంతులేస్తున్నాడు. కొడుకుని చూచి మురిసిపోతూ ఆనందపడుతూ కమల 'అమ్మా వాడు చూడవే... నాన్నా యిటు చూడు' అంటున్నది.

"మరి నీ చీర ఏదమ్మా?" ఆఖరకి అడిగాడు జానకిరామయ్య.

"ఇదుగో" అంటూ యింకో పాకెట్టు విప్పి సాదా చీర చూపించింది. దాని ఖరీదు పాతిక రూపాయలు. కొడుకు డ్రస్సు ఖరీదు డెబ్బై ఐదు రూపాయలు.

## యువతరం



ఫొటోగ్రాఫీ హాబీగా గల వి. వి. కె. ప్రసాద్ యింజనీరింగ్ కళాశాలలో నాల్గవ సంవత్సరం చదువుకొంటున్నాడు. ధీరజ్ చౌడా బొమ్మలంటే సరదా...అయితే అతని ఆశయం మాత్రం చాలా పేరెన్నిక గన్న ఇంజనీయర్ అయిపోవాలన్నదే. ఇంగ్లీష్ నవలలు చదువుతాడు. ఎంచుకొని మరీ చదువుతాడు. హెరాల్డ్ రాబిన్స్ పుస్తకాలు ఇర్విన్‌వాలాస్ గ్రంధాలు యిష్టపడే యీ యువకునికి, ప్రకృతి శోభను, ఎగిరే పిట్టలను బొమ్మలు తీయటంమీద పట్టుదల వుంది...

"లవ్ అఫైర్స్" "సెక్సు సినిమాలు" వీటిపై మోజు వుండటానికి యింట్లో మమతానురాగాలు లేకపోడంకూడా ఒకకారణం అని నమ్ముతాడు వేంకట కృష్ణప్రసాద్. తన యింట్లోవారు అంతా తనను ఎంతో ప్రేమగా ఆదరంగా చూసుకుంటున్నారు కనుక పెద్దగా యిలాంటి వ్యాపకాలు లేవు అని, అన్నాడు ... పోతే సినిమాలలో హిందీ, తెలుగు ఏదైనా, ఈమధ్య 'వల్గారిటీ' ఉంటున్నది. దీనికి కారణం వర్తమానంలో వున్న "సోషల్ సెటప్" కూడా ఒకటి అన్నాడు. బాగా చదవాలనీ, వాళ్ల నాన్నగారు [ఒక పెద్ద డాక్టర్] — తన వయసులో ఎట్లా వుండేవారో అట్లా వుండాలని కూడా ఈ యువకుని ఉద్దేశం.

సంపన్న కుటుంబంలో నుంచి వచ్చిన వాడిగా మాత్రమే గాక సొంత కాళ్లపై నిలబడి మంచి ఉద్యోగం అవీ తెచ్చుకున్నాకా, పెళ్లి చేసుకోవాలనీ, — వరకట్నం గట్రా పుచ్చుకోకూడదు అనీ ప్రసాద్ అనుకుంటున్నాడు.

ఫ్యాషన్‌ల విషయంలో వల్గారిటీ లేనంత వరకూ, అవకాశం యివ్వాలి పెద్దలు — ముఖ్యంగా ఆడపిల్లలు ఫ్యాషనబిల్‌గానూ వుండాలి ... సంసారపక్షంగా, సంస్కృతీ చిహ్నాలుగానూ వుండాలి అని ఈ యువకుని అభిప్రాయం — మంచి ఆరోగ్యకరమైన కోరికలున్న యితనికి సినిమాలైనా, నవలలైనా ఏవైనా చదువు "తరువాతే" — రాజకీయాలు అవీ యిష్టంలేదు. బెటర్ లక్ ఫర్ హిమ్.

[వీరాజీ]